

పటాన్‌చెరు : ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేపీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుడు



మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన సిరిబాబు

# బీఆర్‌ఎస్‌లో చేరికలు

- బీజేపీకి షాక్ ఇచ్చిన ప్రజాప్రతినిధులు
- బీఆర్‌ఎస్‌లో చేరిన బొల్లారం కౌన్సిలర్లు
- ఎమ్మెల్యే గూడెం సమక్షంలో చేరికలు
- ప్రచారంలో గులాబీ శ్రేణుల దూకుడు

పటాన్‌చెరు/ సంగారెడ్డి, నవంబర్ 4 : బీఆర్‌ఎస్‌లోకి ఇతర పార్టీల నాయకుల చేరికలు కొనసాగుతున్నాయి. బొల్లారం కౌన్సిలర్లు ఇద్దరు, ఒక కోఆప్షన్ సభ్యుడు బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. శనివారం పటాన్‌చెరులోని జీఎమ్మార్ కన్వెన్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్‌లో చేరికలు జరిగాయి. బొల్లారం మున్సిపాలిటీకి చెందిన బీజేపీ కౌన్సిలర్లు సాయి కిరణ్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, కోఆప్షన్ సభ్యుడు రంగారెడ్డి, సీనియర్ నాయకులు నారాయణ యాదవ్, ఉదయ్, పవన్ యాదవ్ తదితరులు మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మతతత్వ నినాదమే ఎజెండాతో ముందుకు సాగుతున్న బీజేపీకి డిపాజిట్లు సైతం దక్కవన్నారు. అధికారంలో ఉన్న రాష్ర్టాల్లో బీజేపీ కులగణన చేయకుండా, తెలంగాణలో అధికారంలోకి వస్తే కులగణన చేపడుతామని ప్రకటించడం మోసపూరితమైన వాగ్దానమని విమర్శించారు. కేంద్రం ప్రభుత్వం నిధుల కేటాయింపులో తెంగాణపై వివక్షతను చూపిస్తున్నదన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ తిరుగులేని శక్తిగా మారిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు చూసి నాయకులు బీఆర్‌ఎస్ పట్ల ఆకర్షితులు అవుతున్నారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు తనను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని బీఆర్‌ఎస్ శ్రేణులను కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలరు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి, సతీశ్, బాలామణిరత్నం, బీరప్ప, శైలజ పుండరీకం పాల్గొన్నారు.

## మంత్రి సమక్షంలో ఎంపీటీసీల చేరిక

తెలంగాణలో ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందజేస్తూ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్‌ఎస్‌లో చేరికలు కొనసాగుతున్నాయి. సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు సమక్షంలో సదాశివపేట మండలం ఎల్లారం, రేజింతల్ ఎంపీటీసీలు సుగుణమ్మ, నిర్మలాభాస్కర్ బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరితో పాటు బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరిబాబు, ఎర్రోళ్ల శ్రీనివాస్, మల్లేశం తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

# కాంగ్రెస్.. గో బ్యాక్

- జగ్గారెడ్డి ఒక్కసారైనా కాశీపూర్‌కు వచ్చిండా?
- ఎన్నికల ప్రచారంలో గ్రామస్తుల నిలదీత



కాశీపూర్‌లో కాంగ్రెస్ మహిళా నాయకులను నిలదీస్తున్న గ్రామస్తులు

కంది, నవంబర్ 4 : ఐదేండ్లు ఎమ్మెల్యేగా ఉన్న జగ్గారెడ్డి తమ గ్రామానికి చేసిందేమీ లేదని, కాంగ్రెస్ నాయకులపై కాశీపూర్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా ఒక్క రోజు కూడా కాశీపూర్ గ్రామానికి వచ్చిన దాఖలాలు లేవని, ఇప్పుడూ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు వేయాలని ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ మహిళా నాయకులు, కార్యకర్తలను నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కంది మండల పరిధిలోని కాశీపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులకు చేదు అనుభవం ఎదురైంది. ఎమ్మెల్యేగా గ్రామ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా తమ గ్రామంలో ఒక్క పనైనా చేసాడా? గ్రామ పంచాయతీకి ఎప్పుడైనా వచ్చుడా? ఇప్పుడు ఎందుకు వచ్చారని చీవాట్లు పెట్టారు. మీకు ఓట్లు అడిగే హక్కు లేదని స్పష్టం చేశారు. గ్రామస్తుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



సమ్మేళనానికి బైక్ ర్యాలీగా వస్తున్న యువకులు, నాయకులు



నాయకులతో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాహుల్ కిరణ్



అందోల్ : యువ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



మాట్లాడుతున్న జడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి

క్రాంతన్న గెలుపు..

అందోలు నియోజకవర్గ ప్రగతి ప్రదాత

# పేదోడి విజయం

- క్రాంతికిరణ్‌ను గెలిపించుకుందాం అభివృద్ధిని సాధించుకుందాం...
- జడ్పీ చైరపర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి.
- అందోల్‌లో యువత ఆత్మీయ సమ్మేళనం
- గులాబీవనమైన అందోల్ -జోగిపేట
- హాజరైన కార్పొరేషన్ చైర్మన్లు క్రిశాంక్, గెల్లు శ్రీనివాస్, భిక్షపతి
- ఎంతో చేశాం..ఇంకా చేయాల్సి ఉన్నది
- బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

అందోల్, నవంబర్ 4 : క్రాంతికిరణ్ విజయం.. పేదప్రజల గెలుపు అని, అందోల్‌లో మరోసారి గెలిపించుకుందాం.. అభివృద్ధిని సాధించుకుందాం.. అంటూ సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం అందోల్‌లో యువత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ర్టాన్ని అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చేస్తున్నారని, క్రాంతి కిరణ్ ఎమ్మెల్యేగా అందోలులో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. తాలెల్మ ఎత్తిపోతల, అందోల్-జోగిపేట రోడ్లు, మున్సిపల్‌తోపాటు గ్రామాల్లో సీసీరోడ్లు, కమ్యూనిటీ భవనాలు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. మరొక్కసారి ఆయనను భారీ మెజార్టీతో గెలిపించి అందోల్ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. యువత ఎంతో తెలివైనవారని గత ప్రభుత్వాలు, మన ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ గెలిచినా ప్రజలకు ఏమీ చేయలేరని విమర్శించారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తనకు మొదటిసారి అవకాశం ఇవ్వగా అందోల్ ప్రజలు ఎంతో ప్రేమను పంచారన్నారు. ఈ రోజు యువ ప్రభంజనం చూస్తుంటే అందోల్‌లో గెలుపు ఖాయమైందని, మెజార్టీ కోసం కృషి చేయాలన్నారు. మీ ప్రేమకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని మరో 25రోజులు ఇదే కసితో పనిచేస్తే కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని మనకు ఎలాంటి కష్టాలు ఉండవన్నారు. ఐదేండ్లలో అందోలు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, ఇంకా చేయాల్సింది చాలా ఉన్నదని, మరొసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్పొరేషన్ చైర్మన్లు క్రిశాంక్, గెల్లు శ్రీనివాస్, మఠం భిక్షపతి, మోటివేషన్ స్పికర్, (శ్రీమేధా) చిరంజీవి తమ ప్రసంగాలతో యువతలో మరింత జోష్ నింపారు. కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి ఫరూఖ్‌హుస్సేన్, స్టేట్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాహుల్‌కిరణ్, జైపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంజీవయ్య, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, ఎంపీపీ బాలయ్య, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు, యువజన అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**బీజేపీ వాళ్లవి కథలు.. కాంగ్రెసోళ్లవి అబద్ధాలు**
**★ స్టేట్ టీఎస్ఎండీసీ చైర్మన్ క్రిశాంక్**

దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ ప్రజలకు చేసిన ఉపయోగం ఏమీ లేదని? కానీ, తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని విస్మరించి ప్రజలకు అసత్యాలు.. అబద్ధాలు.. కథలు చెబుతారని కార్పొరేషన్ చైర్మన్ క్రిశాంక్ విమర్శించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాతే యువత బతుకులు బాగుపడ్డాయని... కాంగ్రెస్, బీజేపీ మాటలు వింటే ఆగం అవుతామన్నారు. సోషల్‌మీడియా వారియర్స్ ప్రభుత్వం, ఎమ్మెల్యే క్రాంతికిరణ్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు.

**లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం : గెల్లు శ్రీనివాస్‌యాదవ్**

నీళ్లు.. నిధులు.. నియామకాల కోసం కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో లక్ష ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దని, యువతకు ఉపాధి కల్పించాలన్న చిత్తశుద్ధి ఉన్న ఏకైక నాయకుడు కేసీఆర్ అని టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సీఎం కేసీఆర్ పదేండ్లుగా యువతకు అన్నిరంగాల్లో ఉపాధి కల్పిస్తున్నారన్నారు. యువత సౌమ్యుడు, మంచి మనిషి క్రాంతికిరణ్‌ను గెలిపించాలన్నారు.

**స్థానికుడిని గెలిపించాలి : 'ట్రేడ్' కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి**

అందోల్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్న స్థానికుడు క్రాంతికిరణ్‌ను గెలిపించుకుని మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. యువత ప్రభుత్వ పథకాలు, మ్యానిపెస్టోపై విస్తృతంగా ప్రచారం చేపట్టి భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు.

**గులాబీమయమైన అందోలు-జోగిపేట**

అందోలు-జోగిపేటలో నిర్వహించిన యువ అత్మీయ సమ్మేళనానికి వేలాదిగా యువత తరలివచ్చి బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్‌కు మద్దతుగా నిలిచారు. నియోజకవర్గ వ్యాప్తంగా 8 కిలోమీటర్ల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.



సమావేశానికి ర్యాలీగా వస్తున్న యుకులు